# పనితీరు ఆధారంగానే ప్రగతి

### జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ



మాట్లాడుతున్న జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ

వికారాబాద్, నవంబర్ 8 : పీహెచ్‌సీ వైద్యాధికారుల పనితీరు ఆధారంగానే జిల్లా వైద్య శాఖ ప్రగతి ఆధారపడి ఉంటుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, జిల్లా పరిధిలోని అన్ని పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులందరూ కచ్చితంగా సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశు సంరక్షణ సేవలు, కీటక జనిత వ్యాధులైన డెంగ్యూ, మలేరియా నివారణ నియంత్రణ చర్యలు, కుష్ఠు, మలేరియా, హెచ్ఐవి వంటి అంటువ్యాధుల నివారణ, నియంత్రణ నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణ కొరకు నిరంతరం స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్లు, గుట్కా కైనీ, జరద వంటి వాటిని వినియోగించకుండా వాటి వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. ముఖ్యంగా గర్భవతులకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు, సేవలు అందే విధంగా జాగ్రత్త పడాలన్నారు. ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించాలని తెలిపారు. సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదేశానుసారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలైన తాగునీటి వసతి, పేషంట్ వేచియుండు గదిలో కుర్చీలు ఉండాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్లాబ్ లీకేజీలు, డ్రైనేజీ సమస్యలు, కనీస వసతులకు ఏర్పాటు కొరకు త్వరలో నిధులు విడుదల చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌వోలు డాక్టర్ జీవరాజ్, డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నేహా, డాక్టర్ నిరోషా , డాక్టర్ శ్రీనివాసులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ నర్సింహులు, అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యులు సమయపాలన పాటించాలి

### పెద్దేముల్, ధారూరు పీహెచ్‌సీలను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్


పెద్దేముల్ : సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పెద్దేముల్, నవంబర్ 8 : వైద్యులు ప్రతి రోజు ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఎంతమంది వైద్యులు ఉన్నారు? ప్రతి రోజు ఆసుపత్రికి ఎంతమంది పేషెంట్లు వస్తారు? తదితర పూర్తి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు ఎన్ని ప్రసవాల కేసులను నమోదు చేశారు? దానికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు.అదే విధంగా ఆసుపత్రిలో రన్నింగ్ వాటర్ ఉందా? లైట్స్, ఫ్యాన్స్, సరిపోను ఫర్నిచర్ ఉన్నాయా అని అడిగి తెలుసుకు న్నారు. వైద్యులు కచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఏవైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ఎంపీడీవో జర్నప్ప, వైద్య సిబ్బంది ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

**ధారూరు:** ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగసముందర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఓపీరూమ్, ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంత మంది వైద్యులు ఉన్నారని, ప్రతి రోజు ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తారు అని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి మల్లేశం, తహసీల్దార్ షాజీదా బేగం, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు ఉన్నారు.

### పలుగురాళ్ల తండా అభివృద్ధికి
# సహకరించాలని వినతి


కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న తండా వాసులు

కొడంగల్, నవంబర్ 8: మండలంలోని పలుగురాళ్లతండా గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తండా వాసలు శుక్రవారం కడా కార్యాలయంలో కడా ప్రత్యేకాధికారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలో ఎస్టీ కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం, వీధి దీపాల మరమ్మతువంటి పనులను చేట్టాలని కోరారు. సానుకూలాగా స్పందించిన కడా ప్రత్యేకాధికారి తండా సమస్యల పరిష్కారానికి సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాండు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతీలాల్, హర్యానాయక్, రతన్‌లా, రాందాస్, శ్రీను పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విజయలక్ష్మీ

పరిగి, నవంబర్ 8: రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విజయలక్ష్మీ సూచించారు. పరిగి మండలం గడిసింగాపూర్, రూప్‌ఖాన్ పేట్‌లలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి ధాన్యం గ్రేడ్ ఏ రకం క్వింటాలుకు రూ.2320, కామన్ వెరైటీకి రూ.2300 చెల్లించనున్నట్లు, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాల్సిందిగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ పరిగి బ్రాంచ్ మేనేజర్ వెంకటయ్య, కేంద్రం ఇన్‌చార్జి వెంకటేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్‌రాములు, మాజీ సర్పంచ్ మాణిక్యం, నాయకులు బసిరెడ్డి, రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్యంపై సంస్థ శ్రద్ధ



వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో డిపో మేనేజర్ కరుణ శ్రీ

పరిగి, నవంబర్ 8: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల భాగస్వాముల ఆరోగ్యంపై సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం పరిగిలోని ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.ఎస్‌ను డిపో మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూతూ ఈనెల 11వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల భాగస్వాములందరికీ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతోపాటు చికిత్సల కోసం సంస్థ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఉద్యోగుల భాగస్వాములు ఆరోగ్యంగా ఉంటే ఉద్యోగులు మరింత ఆరోగ్యంగా ఉండి విధులు సక్రమంగా నిర్వర్తిస్తారని అన్నారు. ఈ శిబిరాన్ని ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ సోమ్లు, ఖుద్దూస్, నర్సింగ్‌రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### పంచారామానికి బస్సు...

ఆర్టీసీ పంచారామానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నదని పరిగి డిపో మేనేజర్ కరుణ శ్రీ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ నుంచి ఒక్కొక్కరికి బస్సు చార్జీ రూ.3200 అని తెలిపారు. 30 మంది ప్రయాణీకులుంటే పరిగి నుంచి ప్రత్యేక బస్సు నడపిస్తామని, పరిగి నుంచి పంచారామానికి రూ.3600 చార్జీ ఉంటుందని తెలిపారు. అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడిపించడం జరుగుతుందని ఎంజీబీఎస్ నుంచి రూ.4000, పరిగి నుంచి 30 మంది ఉంటే ప్రత్యేక బస్సు నడిపిస్తామని, పరిగి నుంచి చార్జీ రూ.4400 ఉంటుందన్నారు. శబరిమలకు సైతం బస్సులు వేస్తామని, అవసరమైన వారు సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

# వ్యక్తి ఆత్మహత్య

పరిగి, నవంబర్ 8: ఒంటరి జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పరిగి మండలం రాపోల్‌లో జరి గింది. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాపోల్ గ్రామానికి చెందిన శేఖర్‌కు 9 సంవత్సరాల క్రితం చిట్యాల్ గ్రామానికి చెందిన శిరీషతో వివాహం జరిగింది. వారికి సంతానం కలుగ లేదు. గత నాలుగు నెలల కింద భార్యాభర్తలకు మనస్పర్థలు వచ్చి శిరీష తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. అప్పటికే రోజూ మద్యం తాగే శేఖర్ భార్య పుట్టింటికి వెళ్లిన తర్వాత మరింత అధికంగా మద్యం తాగేవాడు. ఒంటరి జీవితం ఇష్టం లేక ఈనెల 5వ తేదీన శేఖర్ పురుగుల మందు తాగాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు.

# నేడు,రేపు ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపు


ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, నవంబర్ 8: ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం, ఆదివారం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి ఓటరు నమోదుపై అవగా హన కల్పించడంతో పాటు ఇంట్లోని అక్క, అన్నలకు ఓటరు నమోదు చేసుకునే విధంగా తోడ్పడాలని తెలిపారు. ఓటు హక్కు పొందడం వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగి పై దాడి : ఇద్దరిపై కేసు నమోదు

బంట్వారం, నవంబర్ 8 : ఓ ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ మైపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రీతమ్ టైపిస్టుగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలో ఆర్ఎంపీ వైద్యుడుగా పనిచేస్తున్న రాజశేఖర్ గ్యాస్ కనెక్షన్ విషయమై మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ టైపిస్ట్ ప్రీతంను గ్యాస్ సబ్సిడీలో కావాలని అడిగారు. సర్రైన పత్రాలు తీసుకురావాలని ప్రీతమ్ చెప్పాడు. ఇందుకు నిరాకరించి, తనను ఎప్పటికీ ఇలాగే కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహించాడు. ఇదే కాకుండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ తో వచ్చి టైపిస్ట్ ప్రీతం పై ఇరువురు దాడి చేశారు. ప్రీతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# సమగ్ర కుటుంబ సర్వే పనుల పరిశీలన


గొడుగోనిపల్లిలో సర్వే పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దోమ, నవంబర్ 8 :మండల పరిధిలోని గొడుగోనిపల్లి, దోర్నాలపల్లి, గూడూరు, గోన్యానాయక్ తండా,కేశిలమ్మ తండా, మైలారం గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కరింగ్ పనులను శుక్రవారం ఎంపిడీవో మహేష్‌బాబు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సోమలింగం, ఎన్యూమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా కుటుంబాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HELPERS

★ హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం||లు. No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

డాక్యుమెంట్ పోయినది

★ నేను, కొర్ర రేణుక, భర్త: కొర్ర కుమార్, నివాసం: ఇం.నెం. 5-63/2, జాఫర్‌గూడ (గ్రా), అబ్దుల్లాపూర్‌మెట్ (మం), రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-501 512. డాక్యుమెంట్ నెం. 8481/2000, తేది: 24-10-2000, SRO హైదరాబాద్ ఈస్ట్ (హయత్ నగర్) వద్ద నమోదైన నా ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్‌డీడ్ లింక్ డాక్యుమెంట్ 30-10-2024న జిరాక్స్ కోసం అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్తుండగా పోయినది. దొరికినవారు సంప్రదించండి: 8970241464.
NT-339389

డాక్యుమెంట్ పోయినది

★ నేను, K. రాధాకృష్ణ, తండ్రి: కొర్ర యాదయ్య, నివాసం: ఇం.నెం. 5-63/1, జాఫర్‌గూడ (గ్రా), అబ్దుల్లాపూర్‌మెట్ (మం), రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-501 512. డాక్యుమెంట్ నెం. 22828/2006, తేది: 28-10-2006, SRO పెద్ద అంబర్‌పేట వద్ద నమోదైన నా ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్‌డీడ్ లింక్ డాక్యుమెంట్ 30-10-2024న జిరాక్స్ కోసం అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్తుండగా పోయినది. దొరికినవారు సంప్రదించండి: 9666777798.
NT-339389

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం


అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, నవంబర్ 8 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు న్యామత్‌నగర్‌లో శుక్రవారం మున్సిపల్ సాధారణ నిధులు రూ.5లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ ప్రారంభించారు. ప్రతి వార్డులో సమానంగా అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. పట్టణ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా పని చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ వారాల రవీంద్ర, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, నాయకులు పాండు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

నవాబుపేట, నవంబర్ 8: ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసిన ఘటన నవాబుపేట మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. నవాబుపేట పోలీసు స్టేషన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు లింగంపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో దాడులు చేసి వారిని అరెస్టు చేసిన్నట్లు తెలిపారు. వారి వద్దనుంచి రూ. 8890 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# మహిళల భద్రత కోసమే షీటీమ్స్...




వికారాబాద్, నవంబర్ 8 : మహిళల భద్రతకు షీ టీమ్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వికారాబాద్ ఎస్సై సత్యనారాయణరాజు తెలిపారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్న మహిళలు, బాలికలకు సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, షీటీమ్ సిబ్బంది బుచ్చేందర్‌రెడ్డి, రేష్మ, అశోక్ తదితరులు ఉన్నారు.

# ఆలయ నిర్మాణానికి భూమి పూజ



మర్పల్లి, నవంబర్ 8: మండలంలోని పంచలింగాల్ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన బీరప్ప స్వామి దేవాలయానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని బీరప్ప గడ్డ వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భూమి పూజ చేశారు. గ్రామంలో బీరప్ప దేవాలయం నిర్మాణానికి పూనుకోవడం సంతోషకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బావపై బావమరిది హత్యాయత్నం

పరిగి, నవంబర్ 8 : తాగుడుకు బానిసైన వ్యక్తి మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదనే కారణంతో స్వంత బావపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పరిగి పట్టణంలో చోటు చేసుకుంది. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పరిగికి చెందిన దోర్తలి విజయలక్ష్మిని కర్ణాటకలోని చితాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేయగా వారు పరిగిలోనే ఉంటూ కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. విజయలక్ష్మి అన్న ఆనెం నర్సింహులు తాగుడుకు బానిసై రోజు మద్యం కోసం చెల్లెలు, బావను డబ్బుల కోసం వేధించేవాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వని కారణంగా స్వంత బావ శ్రీనివాస్‌పై ఆనెం నర్సింహులు గురువారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఎరుకలి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీనివాస్‌కు గాయాలవ్వగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బావపై హత్యాయత్నానికి పాల్పడిన ఆనెం నర్సింలుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.




### విద్యుత్ సరాఫరాకు అంతరాయం..

కొడంగల్, నవంబర్ 8: పట్టణంలోని కార్గిల్ కాలనీలో లైన్ షిఫ్టింగ్ పనులు కొనసాగుతున్న కారణంగా విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ మహిపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొడంగల్ పట్టణంతో పాటు పర్సాపూర్, కొండారెడ్డిపల్లి, గుండ్లకుట, పాత కొడంగల్, పలుగురాళ్లతండా, మిషన్ భగీరథ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గ్రహించాలని కోరారు.


### వాహనాలకు పార్కింగ్ కోసం వేలం

ధారూరు, నవంబర్ 8: ఈ నెల 12వ తేది నుంచి 17 వరకు జరుగు ధారూరు మేథడిస్టు క్రైస్తవ 102వ, జాతరకు వచ్చు వాహనాలకు పార్కింగ్ కోసం ధారూరు స్టేషన్, దోర్నాల్ గ్రామాల్లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ధారూరు ఎంపిడీవో నర్సిములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ధారూరు స్టేషన్, దోర్నాల్ గ్రామ పంచాయతీలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాతరకు వచ్చు వాహనాలకు పార్కింగ్ కోసం బహిరంగ వేలం వేయుటకు శనివారం ధారూరు స్టేషన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోను, దోర్నాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేర్వేరుగా రూ,3000/- నగదు రూపంలో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### వీరశైవ లింగాయత్ గా నమోదు చేసుకోండి

వికారాబాద్, నవంబర్ 8 : ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే కార్యక్రమం లో వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు అందరు మీ ఇంటి వద్ద కు వచ్చే సర్వే సిబ్బంది కి సహకరించి మన కులం వీరశైవ లింగాయత్ కోడ్ సంఖ్య 115 గా నమోదు చేసుకోవాలని వికారాబాద్ వీరశైవ సమాజం అధ్యక్షులు విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### నలుగురి బైండోవర్



యాలాల, నవంబర్ 8: నాటుసారా విక్రయిస్తూ పట్టబడ్డ నలుగురి నిందితులను ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేసిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకొంది. భానాపూర్ గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు ఆందిన సమాచారం మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ ఆదేశాలతో దాడులు నిర్వహించి నవావత్ రవికుమార్, జ్యోతీబాయి, మోతీబాయి, సక్రియాలను అదుపులోకి తీసుకొన్నారు.

